
సాక్షి సంగారెడ్డి

బుధవారం । 18 । జనవరి । 2023



జీవన దారిలో..

కులవృత్తిపై ఆధారపడిన గౌడన్నలు కల్లు ఉత్పత్తి కోసం ఈత, తాటి వనాల పెంపకం చేపట్టారు. ఈ ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. 8లో



యువకుడి అనుమానాస్పద మృతి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో



'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. 9లో

తగ్గిన రాబడి!

- 2022లో అంతంతమాత్రమే రిజిస్ట్రేషన్లు
- ఉమ్మడి జిల్లాలో తగ్గుతున్న ఆదాయం
- పడిపోతున్న స్థిరాస్థి క్రయవిక్రయాలు



సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రిజిస్ట్రేషన్ల సంఖ్య పడిపోతోంది. వ్యవసాయేతర స్థలాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పడుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం కుదేలవడంతో క్రయవిక్రయాలు చాలా మట్టుకు తగ్గాయి. గతంలో మాదిరిగా ఇంటి స్థలాలు, ఇతర స్థిరాస్తులపై పెట్టుబడులు పెట్టడం తగ్గడంతో క్రయవిక్రయాలు తగ్గి రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం పడిపోతోంది.

- ఉమ్మడి మెదక్ జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయాన్ని పరిశీలిస్తే.. 2021 డిసెంబర్ నెలలో స్టాంప్ డ్యూటీలు, రిజిస్ట్రేషన్ ఫీజులు ఇలా వివిధ రూపాల్లో రిజిస్ట్రేషన్ శాఖకు రూ.106.14 కోట్ల మేరకు ఆదాయం రాగా, గత నెల (2022 డిసెంబర్) ఆదాయం కేవలం రూ.92.98 కోట్లకే పరిమితమైంది.
- రిజిస్ట్రేషన్ల సంఖ్యను పరిశీలిస్తే కూడా తక్కువగానే నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2021 డిసెంబర్ నెలలో 11,835 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా, 2022 డిసెంబర్‌లో 11,385 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. రియల్‌ఎస్టేట్ ఊపు మీద ఉన్నప్పుడు ప్రతినెలా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కానీ ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో స్థిరాస్తి రంగం తగ్గుముఖం పడుతోంది.

సంగారెడ్డి పరిధిలో 10 శాతం తగ్గుదల

ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగే సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్(ఎస్‌ఆర్‌ఓ) పరిధిలో రిజిస్ట్రేషన్లు సుమారు పది శాతం పడిపోయాయి. ఈ ఎస్‌ఆర్‌ఓ పరిధిలో పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, తెల్లాపూర్ తదితర ప్రాంతాల్లో స్థిరాస్తి క్రయవిక్రయాలు జోరుగా సాగుతుంటాయి. అయితే ఈ ప్రాంతాల్లోనే రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిపోయింది. 2021లో సంగారెడ్డి ఎస్‌ఆర్‌ఓ పరిధిలో 32,365 రిజిస్ట్రేషన్లు జరగగా, 2022లో కేవలం 29,640 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. అంటే సుమారు 2,725 రిజిస్ట్రేషన్లు తగ్గాయి.

గజ్వేల్‌లో భారీ పెరుగుదల

గజ్వేల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా పెరిగింది. గత ఏడాదితో పోల్చితే ఇక్కడ సుమారు 3,748 అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇక్కడ పలు అభివృద్ధి పనులు ప్రారంభం కావడమే కారణమనే అభిప్రాయం ఉంది. 2021లో 5,096 రిజిస్ట్రేషన్లు జరుగగా, 2022లో ఏకంగా 8,844 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాగే సదాశివపేట, జహీరాబాద్, రామాయంపేట్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది.

రియల్ రంగం కుదేలే కారణమా?

రియల్‌ఎస్టేట్ రంగం కుదేలవడమే రిజిస్ట్రేషన్ల తగ్గుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే ట్రిబుల్ వన్ జీఓ ప్రభావం కూడా సంగారెడ్డిపై పడినట్లు చెబుతున్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టే స్థిరాస్తి వ్యాపారులు ట్రిపుల్ వన్ జీఓ పరిధివైపు మొగ్గు చూపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే స్థిరాస్తి వ్యాపారులు వ్యవసాయ భూముల వైపు మొగ్గు చూపడం కూడా రిజిస్ట్రేషన్ల తగ్గుదలకు కారణమని చెబుతున్నారు. మరోవైపు అనధికారిక లేఅవుట్లలో స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించడం కూడా రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడానికి కారణం. కాగా ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో స్థలాల మార్కెట్ విలువని గణనీయంగా పెంచింది. దీంతో రిజిస్ట్రేషన్ల చార్జీలు భారీగా పెరిగాయి.

న్యూస్‌రీల్

వ్యర్థాలను పారబోసినందుకు జరిమానా



జరిమానా పత్రాన్ని అందిస్తున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఓ కుంట సమీపంలో వ్యర్థాలను పారవేస్తున్న ఓ పరిశ్రమ యాజమాన్యానికి మున్సిపల్ అధికారులు మంగళవారం జరిమానా విధించారు. మున్సిపల్ పరిధిలోని క్యాష్ అండ్ క్యారీ పరిశ్రమ నుంచి వ్యర్థ ఘన పదార్థాలను సమీపంలోని కుడికుంట సమీపంలో పారబోస్తుండటంతో కౌన్సిలర్ సంతోష గమనించి మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. దీనికి స్పందించిన మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ స్పందించి పారబోసిన వ్యర్థ పదార్థాలను వారితోనే తీసి వేయించి రూ.8,500ల జరిమానా విధించారు. ఎవరు వ్యర్థలను పారబోసినా సహించేది లేదని, చెత్తను ఇతర వ్యర్థాలను బహిరంగంగా పారబోయద్దని అధికారులు ప్రజలు, పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఫోరం సభ్యులు

జహీరాబాద్: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోరం ఫిర్యాదులను స్వీకరించింది. బుధవారం జహీరాబాద్ సబ్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేక కోర్టు నిర్వహించిన సమావేశంలో ఫోరం చైర్మన్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిర్యాదులు స్వీకరించారు. ట్రాన్స్‌కో అధికారులు ఉదాసీన వైఖరిని అవలంభించడం ద్వారా వినియోగదారులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల విషయమై వినియోగదారుల నుంచి రాత పూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించే విషయంలో జరుగుతున్న జాప్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారుల నుంచి 20కి పైగా దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో ఫోరం సభ్యుడు నాగేశ్వరరావుతో పాటు ట్రాన్స్‌కో డీఈ లక్ష్మీనారాయణ, ఏడీఈ మధు, ఏఈలు పాల్గొన్నారు.

చెరకు సాగు, క్రషింగ్‌పై అధ్యయనం



చెరకు సాగును పరిశీలించడానికి బయలు దేరిన సీడీసీ సభ్యులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: చెరకు సాగు, క్రషింగ్ విధానాన్ని పరిశీలించడానికి వివిధ ప్రాంతాలకు వెళ్తున్నామని సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి గణపతి షుగర్స్ సీడీసీ బృందం సభ్యులు బస్సులో బయలుదేరారు. 24వ తేదీ వరకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. మంగళవారం వనపర్తి జిల్లా రామకృష్ణర్, కొత్తకోట ఎస్‌ఎస్‌ఎల్ కృష్ణవేణి షుగర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీని సందర్శించిన సీడీసీ బృందం సభ్యులు అక్కడి ఫ్యాక్టరీలో రోజుకు 3,500 టన్నుల చెరకును క్రషింగ్ చేస్తున్నట్లు తెలిపారు. క్రషింత్ తీరుపై యాజమాన్యంతో మాట్లాడారు. రైతులకు హార్వెస్టింగ్, లేబర్ ట్రాన్స్‌పోర్ట్ అందించే విధానం గురించి తెలుసుకున్నారు. అక్కడ సాగవుతున్న చెరకును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీడ్ వివరాలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి కర్ణాటకలోని చాముండేశ్వరి షుగర్స్ లిమిటెడ్, భారతీ నగర్ దొడ్డి మండ్యకు బయలుదేరారు. ఈ పర్యటనలో సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్ జైపాల్ నాయక్, రైతు సంఘం నాయకులు శంకర్ గౌడ్, అనంతరావు, కులకర్ణి, ప్రభు శేఖర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సాగర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అనంతరెడ్డి, వెంకట్ నరసింహా రెడ్డి, మొగులయ్య వీరప్ప, శంకర్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, శశికాంత్, చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ప్రతిష్టాత్మకంగా జిల్లాలో ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ రాజర్షి షాతో కలసి కంటివెలుగు కార్యక్రమ నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీరాజ్, పోలీస్, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటలకు కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించాలన్నారు. జిల్లాలో 69 టీంలను ఏర్పాటు చేశామని, మరో మూడు బఫర్ టీంలను అందుబాటులో ఉంచామని తెలిపారు. మొత్తం 17,11,680 మందికి స్క్రీనింగ్ చేస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 64 వేల రీడింగ్ కళ్లద్దాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారికి స్క్రీనింగ్ అయిన వెంటనే అందించాలన్నారు. గ్రామ స్థాయిలో రోజుకు 300 మంది, పట్టణాల్లో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు కేంద్రాలను ముందుగా తనిఖీ చేసి నివేదికలు అందజేయాలన్నారు. కంటి వెలుగు కంట్రోల్ రూంను జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏవేవి ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూం(9494851165)కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాజర్షిషా, డీపీఓ, డీఆర్డీఓ, డీఎంహెచ్‌ఓ, జెడ్పీ సీఈఓ, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, అదనపు పీడీలు, ఏపీఎంలు, మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మన బడి పనుల్లో వేగం పెంచాలి

మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాజర్షిషా మన ఊరు – మన బడి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు పూర్తయిన పాఠశాలలకు పెయింటింగ్ పూర్తి చేయాలన్నారు. పనుల్లో జాప్యం చేయకుండా, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పలు నియోజకవర్గాల్లో పనులు నత్తనడకన సాగుతుండటంపై ఈఈలు, డీఈలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తయిన పనులకు వెంటవెంటనే ఎఫ్‌టీఓ(ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్) లను అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్, ఇంజినీరింగ్ శాఖల ఈఈలు, డీఈలు, ఎంఈఓలు, విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మెదక్ డీఎస్పీ సైదులు

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ రహదారి నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని మెదక్ డీఎస్పీ సైదులు, నేషనల్ హైవే పీడీ మధుసూదన్‌రావు అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలం కోళాపల్లి టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి భద్రత వారోత్సవాల ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు, ప్రయాణికులకు హెల్త్ క్యాంపు, కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై నిత్యం భారీ సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇందులో యువత ఎక్కువగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. పోలీసులు ఎన్ని ఫైన్‌లు వేసినా ప్రజల సేఫ్టీగురించేనన్నారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ పేట ప్రాజెక్ట్ హెడ్ వసుంధర, ప్రాజెక్ట్ ఇంజినీర్ విజయ్‌రాజు, ఇన్సిడెంట్ మేనేజర్ మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్: కనీస మద్దతు ధర చెల్లించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్వింటాలు కందులకు ధర రూ.6,600గా మద్దతు ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోతే రైతులు కందులను కొనుగోలు కేంద్రానికి తరలించి లబ్ధి పొందాలన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఇప్పపల్లి పీఏసీఎస్ తరఫున కందులను కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇప్పపల్లి సొసైటీ చైర్మన్ కిషన్‌రావు పవార్, వైస్ చైర్మన్ మాణిక్యమ్మ, మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు బడ్జెట్‌ను కేటాయించండి

మెదక్‌జోన్: కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌ను కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తెలంగాణ కార్మిక సంఘం 2023 కేలండర్‌ను జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్, మెదక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ గౌడ్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో గీత కార్మికులందరికీ ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. 2021–22 బడ్జెట్లో కేటాయించిన డబ్బులు టాడి కార్పొరేషన్‌కు ఇవ్వాలని, సేఫ్టీ మోకు, ద్విచక్ర వాహనాలు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ ఉషా విశ్వనాథ్

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం

అదనపు ఎస్పీ ఉషా విశ్వనాథ్

న్యాల్‌కల్(జహీరాబాద్): నేరాలను అదుపులో ఉంచేందుకు సీసీ కెమెరాల నిఘా ఎంతో ఉపయోగపడుతుందని అదనపు ఎస్పీ ఉషా విశ్వనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని మామిడ్గి గ్రామంలో రూ.2.30లక్షల వ్యయంతో 11 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడ్గి రాష్ట్ర సరిహద్దు గ్రామం అయినప్పటికీ ప్రజా ప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు చైతన్యాన్ని ప్రదర్శించారు. గ్రామ భద్రతను దృష్టిలో పెట్టుకొని కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు, సీఐ వెంకటేష్, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, ఏడుకొండలుతో పాటు చంద్రప్ప, స్వామి, పీటర్‌రాజు, తుక్కారెడ్డి, గ్రామ ప్రజలు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో బాలికలకు ప్రాధాన్యం ఇవ్వాలి

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ



విజేతలకు బహుమతులను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ


జోగిపేట(అందోల్): క్రీడా పోటీల్లో బాలికలకు భాగస్వామ్యం కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. అందోలు మండలం డాకూరు గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో ఆసక్తి ఉన్న బాలికలు ఎంతో మంది ఉన్నారని, ఇలాంటి సమయాల్లో అవకాశం కల్పిస్తే వారి ప్రతిభ బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీలను ప్రభుత్వ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. క్రీడల్లో ఓటమి చెందిన వారు నిరాశపడకుండా విజయం కోసం సాధన చేయాలన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఈ పోటీల్లో డాకూరు గ్రామానికి చెందిన జట్టు విజయం సాధిండంతో ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, అందోలు జట్టుకు ద్వితీయ బహుమతి కింద రూ.5వేలు నగదుతో పాటు షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ, ఎస్‌ఐ – 2 జయశంకర్, పీఈటీ వీటీ శ్రీనివాస్, శ్రీకాంత్, కనకప్రసాద్, తరుణ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

మెదక్‌జోన్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మెదక్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట టీఎస్‌యూఈ ఈయూ–సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి ఎస్‌ఈ జానకీరాముకు పలు డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో పీఆర్సీ కమిటీని వేసి రిపోర్ట్ ఇచ్చినా నేటికి 2022 పీఆర్సీతోపాటు 2023 పీఆర్సీని ప్రకటించ లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్, నాయకులు స్వామి, రాజు నాయక్, చంద్రభాను, నాగరాజు, సలీం, మల్లేశ్, సునీల్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

తండాకు చేరుకునే లోపే..

- డ్రైవర్‌ను చంపి.. కారులో సజీవ దహనం చేసి!
- ధర్మానాయక్‌ను విచారిస్తున్న పోలీసులు



వెంకటాపూర్, బీమ్లా తండా మధ్యలో దహనమైన కారు

టేక్మాల్(మెదక్): ధర్మానాయక్ హైదరాబాద్ నుంచి బీమ్లా తండాకు కారులో ఈ 8వ తేదీ సాయంత్రం బయలుదేరాడు. రాత్రి 11:44 నిమిషాలకు ఆయన ప్రయాణిస్తున్న కారు టేక్మాల్ మండల పరిధిలోని వెంకటాపూర్ దాటింది. ఇంకో రెండు కిలోమీటర్లు అయితే తన గమ్యస్థానానికి చేరుకుంటాడు. కిలోమీటరు దాటాక చెరువుకట్ట సమీపంలో కారు సజీవ దహనమైంది. 9వ తేదీన కారు తగలబడిందని, అందులో ఒకరు ఉన్నారంటూ ప్రసార మాధ్యమాల్లో వార్తలు కూడా వచ్చాయి. ఆ కారు ధర్మనాయక్‌ది అని, చనిపోయింది కూడా ధర్మానాయకే అని ఒక అంచనాకు వచ్చారు. అయితే ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అనేక సందేహాలు రేకెత్తాయి. కారు దహనమైన చోట పెట్రోల్ బాటిల్ ఉండడంతో అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేసు మిస్టరీని ఛేదించేందుకు మెదక్ ఎస్పీ రోహిణీప్రియదర్శిని ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా ధర్మానాయక్ కుటుంబసభ్యుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లపై దృష్టి సారించారు. డెత్ సర్టిఫికెట్ తీసుకోమంటూ ధర్మానాయక్ చేసిన మెసేజ్ ఆధారంగా పోలీసులు విచారణ జరిపారు. చనిపోయింది ధర్మానాయక్ కాదనే ఓ అంచనాకు వచ్చారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పూణే సమీపంలో ధర్మానాయక్ ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం టేక్మాల్‌కు తీసుకొచ్చి పోలీసులు విచారించారు. ఆపై మెదక్‌కు తరలించారు.

చనిపోయింది ఎవరు ?

ధర్మానాయక్‌కు రెగ్యులర్ డ్రైవర్ లేడు. రోజువారీ కిరాయి ఇస్తానని హైదరాబాద్‌లో ఒకరిని ఎంగేజ్ చేసుకున్నాడు. 8వ తేదీన డ్రైవర్‌కు ఫుల్‌గా మద్యం తాగించిన తర్వాత గొడ్డలితో నరికిచంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆపై కారులో ఆ డ్రైవర్ మృతదేహాన్ని ఉంచి పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు పోలీసులు ఓ అంచనాకు వచ్చారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే ఇదంతా చేశాడని, దీని కోసమే రెండు నెలల క్రితం సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేశాడు. డ్రైవర్‌తో సహా కారును సజీవదహనం చేశాక ధర్మానాయక్ జరిగిన విషయాన్ని భార్యకు చెప్పిన తర్వాత సమీప అటవీ ప్రాంతం గుండా షాబాద్ తండాకు చేరుకున్నాడు. అక్కడి నుంచి మరో వాహనంలో పరారయ్యాడు. మృతుడి స్వస్థలం బీహార్‌గా భావిస్తున్నారు.

నవీన్‌పేటలో స్కెచ్

ధర్మానాయక్ అక్క నిజామాబాద్ జిల్లాలోని నవీన్‌పేటలో ఉంటుంది. అక్క కొడుకుతో కలిసి ఇన్సూరెన్స్ డబ్బు కోసం పథకం వేసినట్లు ప్రచారం జరుగుతోంది. హత్యకు సహకరిస్తే పెళ్లికి సాయంతోపాటు, కొంతడబ్బు కూడా ముట్టజెప్పుతానని ఆశ చూపినట్టు సమాచారం.

మండిపడుతున్న తండావాసులు

డబ్బు కోసం ధర్మానాయక్ ఈ ఘటనకు ఒడిగట్టడంపై తండావాసులు మండిపడుతున్నారు. మంగళవారం మీడియా బృందం తండాకు చేరుకొని ధర్మానాయక్ భార్య నీల, ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అయితే వారు నోరు మెదపలేదు. మెదక్ డీఎస్పీ, అల్లాదుర్గం సీఐ, మెదక్ సీఐ, టేక్మాల్ పోలీసులు ఘటనా స్థలానికి ధర్మా నాయక్‌ను తీసుకొచ్చి వివరాలు సేకరించినట్టు సమాచారం. ధర్మానాయక్ కస్టడీలో ఉన్నా తమకేమీ సమాచారం లేదంటూ పోలీసులు సమాధానం ఇస్తున్నారు.

జీవన దారిలో..

తాటి జాన్‌రెడ్డి /
సాక్షి, సంగారెడ్డి డెస్క్ ...

ఒకప్పుడు తాటి, ఈత వనాలు సహజసిద్ధంగా పెరిగేవి. పల్లెల్లో.. నగరశివారులో విరివిరిగా ఉండేవి. ఒకవైపు రియల్ బూమ్, మరోవైపు నీటివసతితో సాగువిస్తీర్ణం పెరగడంతో వనాలన్నీ క్రమక్రమంగా అంతరించిపోతున్నాయి. వాటి స్థానంలో పంటపొలాలు, ప్లాట్లు దర్శనమిస్తున్నాయి. మారిన, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కల్లు ఉత్పత్తిని చేసే వివిధ వనాల పెంపకానికి రైతులు, గౌడ సామాజికవర్గానికి చెందిన కొందరు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నికర ఆదాయం దీర్ఘకాలికంగా వస్తోంది.

లచ్చయ్యగౌడ్ రాత మార్చిన గీత

మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిధిలోని వెంకటాపూర్ (పీటీ) గ్రామానికి చెందిన లచ్చయ్యగౌడ్ యుక్తవయస్సులో కోరుట్ల, మెట్‌పల్లి, హైదరాబాద్ కల్లు డిపోల్లో పనిచేశాడు. 2006–07 ప్రాంతంలో స్వగ్రామానికి వచ్చాడు. పిల్లల పోషణకు కులవృత్తి తప్ప మరేదారి కనిపించలేదు. కల్లు సొసైటీలో సభ్యత్వం కోసం ప్రయత్నించినా, అవకాశం రాలేదు. అప్పుడే లచ్చయ్యగౌడ్ మదిలో ఓ ఆలోచన మెదిలింది. తూప్రాన్–నర్సాపూర్ రోడ్డులో బ్రాహ్మణపల్లి రైల్వే ట్రాక్ పక్కన మూడున్నర ఎకరాల పొలం ఉంది. అందులో ఈత వనం పెంచాలని నిర్ణయించుకున్నాడు. ఈత మొక్కల కోసం పలుచోట్ల తిరిగాడు. చివరకు ప్రస్తుత సంగారెడ్డి జిల్లా పెద్దాపూర్‌లో ఒక్కో ఈత మొలకకు రూ.30 ఖర్చు చేసి 2,000చెట్లు కొన్నాడు. మొక్కకూ మొక్కకు ఆరడుగుల ఎడం, వరుసకు వరుసకు పన్నెండు అడుగుల దూరంలో ఈత మొక్కలు నాటాడు. మొదట్లో ఎంతోమంది అవహేళన చేశారు. ముందు మొక్కలు పెరగనీయి.. తర్వాత మేం కూడా కల్లు గీత పెడతాం అంటూ మాటలతో మదనపడేలా చేశారు.

ఏడాది పొడవునా ఈత కల్లు



సహజంగా ఈత కల్లు సీజన్ అక్టోబర్ మాసంలో మొదలై జనవరితో ముగుస్తుంది. లచ్చయ్యగౌడ్ తన వనంలో ఏడాది పొడవునా కల్లు గీసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. తనకున్న రెండు వేల ఈత మొక్కల్లో వర్షా, శీతాకాలంలో సగం చెట్లు, ఎండాకాలంలో సగం చెట్ల నుంచి కల్లు తీసేవిధంగా గీత పెట్టించాడు. ఇప్పుడు ఏడాది పొడవునా కల్లు దొరుకుతోంది. ఒక్కో చెట్టుకు రెండు నుంచి మూడునాలుగు లీటర్ల వరకూ కల్లు పారుతోంది. లీటరు ముంతకు రూ.50, రెండు లీటర్లకు రూ.100, మూడు లీటర్లకు రూ.150, ఒకే చెట్టు కల్లుకు రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన కల్లు చెట్ల వద్దే దొరకడం, వనం వద్దే కూర్చొని తాగుతున్నామన్న ఫీలింగ్ రావడంతో క్రమక్రమంగా ఇక్కడకు వచ్చేవారికి సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజు సగటున 200 లీటర్ల వరకూ ఈత కల్లు విక్రయిస్తున్నాడు. తన కుటుంబం ఆదాయం పొందడమే కాకుండా, మరో ఐదుగురు గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాడు.

ముందుగానే కోర్టు మెట్లు ఎక్కాడు

2007లో పెట్టిన పిలకలు ఐదేళ్లకు చేతికొచ్చాయి. 2012లో కల్లు పారడం మొదలైంది. అప్పట్లో ఒక్కో గీతకార్మికుడు 30 చెట్ల వరకు కల్లు గీసుకునేందుకు మాత్రమే అనుమతి ఉండేది. తాను కష్టపడి పెట్టిన వనం పరులపాలు చేయడం ఇష్టం లేని లచ్చయ్యగౌడ్ హైకోర్టును ఆశ్రయించాడు. తాను పెంచిన ఈత వనంలో తానే కల్లు గీయించుకునే విధంగా అనుమతి ఇవ్వాలని కోరాడు. కోర్టు తీర్పు ఆయనకే అనుకూలంగా వచ్చింది.

● వన సేద్యం ఇలా...

నీటి వసతిని బట్టి ఈ వనాలకు రోజు విడిచి రోజు లేదా, వారానికోసారి తడులు ఇస్తారు. ఎప్పటికప్పుడు పెరిగిన కొమ్మలను కట్ చేస్తారు. ఏడాదికోసారి వనానికి పశువుల పెంట మాత్రమే వేస్తారు. ఒకవేళ చెట్లు ఎండిపోయినా, గీత సరిగ్గా రాకపోయినా ఎలాంటి సస్యరక్షణ చర్యలు అందుబాటులో లేవు. ఈత, తాటికి సంబంధించిన మేలుజాతి విత్తనాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేవీ లేవు. వ్యవసాయ, లేదా ఉద్యాన వన శాస్త్రవేత్తలు కూడా ఈ వనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు కూడా లేవు.



వెంకటాపూర్ (పీటీ)లోని ఈత వనం




నీరా

కేవలం తాటి, ఈత చెట్ల నుంచే నీరా తీస్తారు. ముందుగా చెట్లకు ఉన్న మడ్డిని పూర్తిగా తొలగిస్తారు. కల్లు గీత పెట్టిన ఆకులను తీసేసి, వాటిస్థానంలో కొత్త ఈత, తాటి ఆకులు పెడతారు. కొత్త కుండలు విరివిగా ఉంటే.. అవి పెట్టడమో లేకపోతే.. కుండకు ప్లాస్టిక్ కవర్ చుట్టి చెట్టుకు కడతారు. డిమాండ్‌ను బట్టి మాత్రమే నీరా తీస్తారు. లచ్చయ్యగౌడ్ వనంలో ప్రతిరోజూ 20 లీటర్ల వరకూ నీరా తీస్తారు.

కేఫ్



హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో రూ.13 కోట్ల వ్యయంతో నీరా కేఫ్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. తాటి, ఈత చెట్ల నుంచి సేకరించి నీరా అమ్మేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ నీరా సెంటర్లు పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.




ఐదారు రకాల చెట్ల నుంచి కల్లు

కల్లు అనగానే ఠక్కును గుర్తుకొచ్చేది తాటి, ఈత కల్లే. ఇవి కాకుండా జీలుగ, ఖర్జూర, కొబ్బరి కల్లు కూడా ఆయా ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉంది. భద్రాచలం నుంచి విశాఖపట్నం వరకు ఆయా అటవీప్రాంతాల్లో జీలుగ కల్లు అందుబాటులో ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఖానాపురం అడవుల్లోనూ వీటిని గిరకతాళ్లతో పిలుస్తారు. ఖర్జూరసాగుకు అనుకూలంగా ఉన్న నేలల్లో ఈ చెట్లను పెంచుతూ ఆయా ప్రాంతాల్లోనూ ఖర్జూర కల్లు గీస్తున్నారు. కొబ్బరితోటల పెంపకం ఉన్న చోటా కొబ్బరి కల్లు గీస్తున్నారు. అరుదుగా కొన్ని చోట్ల వేప, చింత చెట్ల నుంచి కూడా కల్లు కూడా గీస్తారు.

తాటి కల్లు ఎన్ని రకాలో...

పొద్దాటి, పండుతాడు, పరుపుతాడు, ఒంపులు, నాపతాడు, పుల్లలు పేరిట తాటి కల్లు ఆయా నెలల్లో అందుబాటులో ఉంటుంది. తాటి కల్లు సీజన్ జనవరి నెలలో ప్రారంభమై.. జూలై, ఆగస్ట్ వరకు కొనసాగుతుంది.

ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి



ఈత చెట్లు పెడతా అంటే మొదట అందరూ నవ్వారు. అడుగడుగునా అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేశారు. కుటుంబసభ్యులు కూడా మొదట్లో వద్దన్నా తర్వాత అండగా నిలిచారు. నేనుసాకిన చెట్లు నా పిల్లలకే చెందాలంటూ కోర్టుకు పోయిన. చివరకు ఎక్సైజ్ అధికారులు లైసెన్స్ మంజూరు చేశారు. కష్టపడి చేసుకుంటే వనాల పెంపు లాభసాటిగానే ఉంటుంది. మరో ఐదారుగురికి ఉపాధి ఇవ్వొచ్చు.

– లచ్చయ్యగౌడ్, ఈత వనం యజమాని, వెంకటాపూర్ (పీటీ),

మరికొందరు...

మూడున్నర ఎకరాలతోనే లచ్చయ్యగౌడ్ ఆగిపోలేదు. ఈ వనం పక్కనే ఉన్న మరో రెండు ఎకరాల్లోనూ ఈత, జీలుగ, ఖర్జూర చెట్లు పెంచుతున్నాడు. వెంకటాపూర్‌లోనూ పలువురు ఐదు గుంటల నుంచి పది, ఇరవై, ఎకరం వరకూ ఈతవనాలు పెంచుతున్నారు. శివ్వంపేట మండలపరిధిలోని చెన్నాపూర్‌కు చెందిన రాంచందర్ కూడా తనకున్న 30 గుంటల్లో ఐదేళ్ల క్రితం 500 మొక్కలతో ఈత వనం నాటాడు. ఇదే మండల పరిధిలోని దొంతి, గుండ్లపల్లి, చండి, చిన్నగొట్టుముక్కుల, చెన్నపూర్, నవాబుపేట గ్రామాల్లో వారి వారి సొంత వ్యవసాయ భూమిలో పెంచుతున్నారు. పలువురు రైతులు వారి సొంత ఖర్చులతో వనం పెట్టగా.. మరికొందరు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈత మొక్కల పెంపకం చేపడుతున్నారు. చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో గౌడ సొసైటీకి సంబంధించిన ఎకరంన్నరలో 500 చొప్పున రెండు దఫాలుగా మొత్తం వెయ్యి ఈత చెట్లు పెట్టారు. ఇందులో ముందుగా పెట్టిన చెట్లకు కల్లు పారుతోంది.

రోజువారీ ఆదాయం రావాలని..



లక్ష్మారెడ్డి

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన లక్ష్మారెడ్డి మొదటగా కూరగాయలు సాగు చేశారు. నీరు లేని కారణంగా పెట్టుబడి రాని దుస్థితి. ఏ పంట సాగుచేస్తే బాగుంటుందని ఆలోచించాడు. రోజువారీ ఆదాయం వచ్చేవాటిపై దృష్టి సారించాడు. తొమ్మిదేళ్ల క్రితం తనకున్న రెండు ఎకరాల్లో ఈత చెట్లు 900, 400 జీలుగ చెట్లు నాటాడు. చిత్తూరు నర్సరీ నుంచి సంగారెడ్డి జిల్లా నుంచి ఒక్కో చెట్టుకు రూ.30 ఖర్చు చేశాడు. నాటినాటికి వంద రూపాయల దాకా ఖర్చు అయ్యింది. మూడేళ్ల నుంచి ఈత కల్లు పారుతోంది. ఒక్కో చెట్టుకు రెండున్నర లీటర్ల వరకు కల్లు వస్తోంది. రెండు నెలల పదిహేను రోజుల వరకే కల్లు గీస్తున్నారు. రోజుకు సగటున 40 లీటర్ల కల్లు తీస్తుండగా, లీటరు ధర రూ.75 అమ్ముతున్నారు. నవంబర్ నుంచి జూలై వరకు ఈత కల్లు గీస్తారు.

మిత్రుడి సలహాతో జీలుగు సాగు

ఈతవనం పెట్టేందుకు ముందుగా కడియం నర్సరీకి వెళ్లాడు. అక్కడ సరైన మొక్కలు దొరకలేదు. పోలవరంలో ఓ మిత్రుడి సలహాతో జీలుగు చెట్ల వద్దకు వెళ్లాడు. కల్లు తాగాడు.. రుచికరంగా ఉండడంతో జీలుగ చెట్లు పెంచేందుకు సిద్ధమై కడియం నర్సరీకి వెళ్లాడు. రెండేళ్ల వయస్సున్న 200 జీలుగ చెట్లు తీసుకొచ్చాడు. చెట్టుకు చెట్టుకు 18 ఫీట్ల ఎడంతో చెట్లు పెట్టాడు. ఒక్కో చెట్టుకు రూ.200 వరకూ పడింది. ఏజెన్సీలో మాత్రమే విరివిగా పెరిగే ఈ జీలుగ చెట్లకు ఇక్కడి వాతావరణం అనుకూలించలేదు. ఇందులో కొన్ని చెట్లు చనిపోయాయి. ప్రస్తుతం కొన్నిచెట్లకు జీలుగ కల్లు పారుతోంది. ఒక్కో చెట్టుకు 18 లీటర్ల వరకూ కల్లు వస్తోంది. లీటరు జీలుగ కల్లు వంద రూపాయలకు అమ్ముతున్నారు. ఒకవేళ జీలుగ కల్లు అమ్ముడుపోకపోతే బెల్లం తయారు చేయవచ్చు. లీటర్ కల్లుకు వంద గ్రాముల బెల్లం తయారవుతుంది. కొబ్బరి, ఖర్జూర చెట్లు కూడా ఈ వనంలో పెంచుతున్నానని, సీజన్‌లో ఖర్జూర కల్లు అమ్ముతానని రైతు లక్ష్మారెడ్డి చెప్పారు. కష్టపడితేనే ఫలితాలు వస్తాయని, యువత స్వయం ఉపాధికి ఈ వనాలను పెంచవచ్చన్నారు.



గుమ్మడిదల: కల్లుపారుతున్న జీలుగు చెట్టు ఇదే

వ్యక్తి అదృశ్యం



మహేశ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళ్లకల్‌లో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. మంగళవారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన పల్నాటి (మంగళి) మహేశ్ సిటీలో హెయిర్ సెలూన్‌లో పని చేసేవాడు. పదేళ్ల క్రితం పనికి వెళ్లి ఇప్పటికి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం తెలిసినవారిని, బంధువులను విచారించింది. ఇప్పటి వరకు అతడి కోసం ఎదురు చూసింది. అతడి ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం మహేశ్ భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 24 మందికి కోవిడ్ ర్యాపిడ్, అదేవిధంగా 15 మంది ఆర్టీపీసీఆర్ నిర్వహించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- ఇద్దరిపై దాడి చేసిన గ్రామస్తులు

పటాన్‌చెరుటౌన్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామ పరిధిలో ఇద్దరు యువకులను గ్రామస్తులు కొడుతున్నారని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లారు. లక్డారం గ్రామస్తులైన సాయి కుమార్, రాజుపై జరుగుతున్న దాడిని అడ్డుకున్నారు. ఎందుకు కొడుతున్నారని గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాయికుమార్, రాజు, జోగన్న(24) సోమవారం రాత్రి మద్యం తాగారు. జోగన్న గుర్రలోల్ల కుంటలో పడిపోయాడు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు స్నేహితులు రాజు, సాయికుమార్ బయటకు తీసేందుకు ప్రయత్నించారు.ఎంతకీ బయటికి రాకపోవడంతో అక్కడే వదిలేసి ఎవరికీ కూడా చెప్పకుండా వెళ్లిపోయారు. తెల్లవారి చూసేసరికి జోగన్న అలియాస్ జగన్ అన్న చనిపోయి ఉండటంతో అతడి బంధువులు గ్రామస్తులతో కలిసి సాయికుమార్, రాజుపై దాడి చేశారు. పోలీసులు మృతదేహాన్ని చెరువు నుంచి బయటికి తీసి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి పెంటయ్య తన కుమారుడిని రాజు, సాయికుమార్ హత్యచేసారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జగన్ (ఫైల్)

రెండు బైక్‌లు ఢీ: వ్యక్తి మృతి

మెదక్ మున్సిపాలిటీ: రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మెదక్ పట్టణ శివారులో మంగళవారం సాయంత్రం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన ఆకుల నర్సయ్య(52), అదే గ్రామానికి చెందిన ముస్టి గట్టయ్య బైక్‌పై వ్యవసాయ పనుల నిమిత్తం మంగళవారం మెదక్ పట్టణానికి వచ్చారు. తిరిగి సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పట్టణ శివారులోని మంజీరా వెంచర్ వద్ద ఎదురుగా వచ్చిన మరోబైక్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆకుల నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త మృతికి కారణమైన శివ్వాయిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఆకుల గుండమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఆకుల నర్సయ్య (ఫైల్)

సైబర్ నేరాలపై పోలీసు బృందం కళాజాత

దుబ్బాకరూరల్: మండల పరిధిలోని ఆకారం గ్రామంలో నేరాలపై మంగళవారం రాత్రి పోలీస్ కళాబృందం ‘కనువిప్పు’ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మహేందర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి వ్యక్తిగత బ్యాంక్ వివరాలు అడిగితే తెలపకూడదన్నారు. అపరిచితులు ఫోన్‌చేసి వివరాలు అడిగితే తెలపకూడదని, అలా ఎవరైనా చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణం, ఎంపీటీసీ లక్ష్మినారాగౌడ్, పోలీస్ కళాబృందం సభ్యులు బాల్ నర్సు, రాజు, రవీందర్, తిరుమల, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మహేందర్

ప్రమాదవశాత్తు పాడిగేదె మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రమాదవశాత్తు పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని లెనిన్ నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దాసారి నాగేశ్వర్ తన పాడిగేదెను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం మృతి కనిపించింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

వ్యక్తి ఆత్మహత్య



నరేశ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): కుటుంబ కలహాలతో భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేటకు చెందిన సుతారి నరేశ్ (35) భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతోనే పట్టణ శివారులోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఐదేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు.

19న జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్ : జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో 19న జాబ్ మేళా నిర్వహిస్తారని ఇన్‌చార్జి జిల్లా ఉపాధి అధికారి రాధిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో 50కి పైగా ప్రొఫెషనరీ ఆఫీసర్లు, 100 జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08455271010లో సంప్రదించాలని కోరారు.

బోరు మోటారు చోరీ

నారాయణఖేడ్: మండలంలోని అంత్వార్ శివారు ప్రభుత్వ నర్సరీలోని బోరు మోటారును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మంగళవారం సర్పంచ్ లింగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. జడ్జి 32 మందికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేలు జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు.

సంగారెడ్డిటౌన్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. శని, ఆది, సోమవారాల్లో పట్టణంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 17 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా జడ్జి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రాజు తెలిపారు.

టీచర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేటరూరల్: నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జునను కులంపేరుతో దూషించి, దాడి చేసిన దుండగులను శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి గ్రామంలో టీచర్ మల్లికార్జునపై దాడి చేయడం అనాగరిక చర్యన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, శోభ, కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దామరకుంటలో హైనా సంచారం !



దామరకుంటలో పొలాల వద్ద పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మర్కూక్(గజ్వేల్): హైనా సంచారంతో జనం భయాందోళన చెందుతున్నారు. మండలంలోని దామరకుంట గ్రామంలో సోమవారం రాత్రి పొలాల సమీపంలో హైనా నడుచుకుంటూ వెళ్తున్నట్లు గమనించిన రైతులు భయంతో పరుగు తీశారు. మంగళవారం ఉదయం గ్రామస్తులకు తెలపడంతో వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సర్పంచ్ గాయత్రి, ఎంపీటీసీ కృష్ణయాదవ్‌తో కలిసి హైనా సంచరిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఫారెస్ట్ అధికారి షెకావత్, బీట్ అధికారి జ్యోతి, ఖలీల్ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పొలాల వద్ద హైనా పాదముద్రల కోసం వెతికారు. అక్కడ ఎలాంటి ఆనవాళ్లు కనపించకపోవడంతో హైనానా, అడవి జంతువులా అనేది సందేహం వ్యక్తం చేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, మరోసారి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. గతంలోనూ హైనా సంచరించినట్లు స్థానికులు తెలిపారు.